అంగన్‌వాడీ టీచర్‌లతో మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీలకు శిక్షణ

కొడంగల్, జూన్ 22 : పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలపై కొడంగల్ ప్రాజక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్‌లకు శిక్షణ చేపడుతున్నట్లు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల అభివృద్ధిలో శారీరక, భాష, మేధోవికాసం, భావోద్వేగ, సృజనాత్మక అభివృద్ధులు ఈ వయస్సులోనే జరుగుతుయాని పేర్కొన్నారు. వాటిని ఆటపాటల ద్వారా పెంపొందించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన అంశాలపై శిక్షణా కార్యక్రమం ఈ నెల 20 నుంచి వచ్చే నెల జులై 10 వరకు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. బృందాలవారీగా టీచర్‌లకు శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకులు ప్రభ, జగదీశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పోస్టుల మంజూరుతో సంబంధం లేకుండా వీలీలను నియమించాలి

బొంరాస్‌పేట, జూన్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల మంజూరుతో నిమిత్తం లేకుండా విద్యా వలంటీర్లను నియమించాలని తపస్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు బాకారం చంద్రశేఖర్, అనిల్‌కుమార్, గోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వారు బొంరాస్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ.. బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, టీచర్లు లేక విద్యార్థులు నష్టపోతున్నారని వారు అన్నారు. ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పిస్తే చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ అవుతాయన్నారు. ముఖ్యంగా బొంరాస్‌పేట మండలంలోని యూపీఎస్‌లలో పోస్టులను మంజూరు చేయలేదని.. దీనివల్ల ఆయా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గంపై సీఎం రేవంత్‌రెడ్డిప్రత్యేక దృష్టి సారించి పోస్టుల మంజూరుతో సంబంధం లేకుండా డీఎస్సీకి ముందే విద్యా వలంటీర్లను నియమించాలని వారు కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కాశీపతి పాల్గొన్నారు.

28న క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం

ధారూరు, జూన్ 22 : శ్రీ సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం కేరెళ్లి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న కేరెళ్లిలో ఎంఎన్‌జే హాస్పిటల్ హైదరాబాద్ వారిచే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతీ మహిళ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

పరిగి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, నాయకులు నయీం, శ్రీనివాస్, వెంకటేశ్, నాని, సాయి, రాజు, కృష్ణ, నారాయణ, రహీం ఉన్నారు. - పరిగి, జూన్ 22



మండలంలోని గుండ్లమర్పల్లి గ్రామంలో బచ్చన్‌గారి బిచ్చయ్య మృతి చెందగా.. ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి బిచ్చయ్య అంత్యక్రియలకు రూ.5వేలు పంపగా స్థానిక నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. - మర్పల్లి, జూన్ 22

ఇంట్లో డబ్బులు దొంగిలించాడనే అనుమానంతో అన్నపై దాడి

చికిత్స పొందుతూ మృతి

వికారాబాద్, జూన్ 22 : ఇంట్లో ఉన్న డబ్బులు దొంగిలించాడనే అనుమానంతో తమ్ముడు అన్నను చితకబాదిన ఘటన మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోమిన్‌పేట మండలం పాత కొల్కొంద గ్రామానికి చెందిన బంబారి లచ్చయ్యకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు నర్సింహులు, రెండో కుమారుడు శ్రీనివాస్(35), మూడో కుమారుడు రాజశేఖర్ వేర్వేరుగా ఉంటున్నారు. శుక్రవారం రాత్రి శేఖర్ ఇంట్లో లేని సమయంలో శ్రీనివాస్ డబ్బుల కోసం వెతుకుతున్నాడు. ఇంటికి వచ్చిన శేఖర్ కంటపడ్డాడు. తను దాచుకున్న డబ్బులు కనబడటం లేదని శ్రీనివాస్ తీసి ఉంటాడనే అనుమానంతో శేఖర్ గొడవకు దిగాడు. పక్కనే ఉన్న నర్సింహులు గమనించి వారిని విడిపించాడు. మళ్లీ కొంత సమయానికి గొడవకు దిగి శేఖర్ కర్రతో దాడి చేసి శ్రీనివాస్‌ను తీవ్రంగా గాయపర్చాడు. శనివారం ఉదయం శ్రీనివాస్‌కు తగిలిన గాయాలను గుర్తించి నర్సింహులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు అదృశ్యం

కులకచర్ల, జూన్ 22 : యువకుడు అదృశ్యమైన సంఘటన కులకచర్ల మండల పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన రేని కృష్ణయ్య(35) ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు శనివారం పోలీస్టేషన్‌లో కృష్ణయ్య కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణయ్య వృత్తి రీత్యా ఆటోడ్రైవర్. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాండూరు నియోజకవర్గం లోని ఆలయ పాలక మండళ్ల ఏర్పాటుకు కృషి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శనివారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి విజ్ఞప్తి చేశారు. - తాండూరు, జూన్ 22

తాండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాలాల మండలానికి కేటాయించిన స్వచ్ఛ విద్యాలయ శానిటేషన్ ట్రక్కును యాలాల ఎంఈవో సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశ్వరగుప్తాతో కలిసి ప్రారంభిస్తున్న ఎంపీ

పనుల్లో వేగం పెంచండి

యాలాల, జూన్ 22 : జుంటుపల్లి ప్రాజెక్టు తూము మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీపీ బాలేశ్వరగుప్తాతో కలిసి మండల పరిధిలోని జుంటుపల్లి ప్రాజెక్టు తూము మరమ్మతు పనులను పరిశీలించారు. తూము మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈ కృష్ణయ్య, ఏఈ నవీన్‌కుమార్‌లను ఆదేశించారు. వర్షాలు పడితే ప్రాజెక్టు నిండడం వల్ల తూము ప్రమాదానికి గురై ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.అంతకుముందు జుంటుపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జేకేఎమ్ఆర్ ఫౌండేషన్ సేవలను మరింత విస్తరించి విద్యార్థు కష్టాలను దూరం చేస్తామని ఎంపీ అన్నారు. తాండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాలాల మండలానికి కేటాయించిన స్వచ్ఛ విద్యాలయ శానిటేషన్ ట్రక్కును యాలాల ఎంఈవో సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశ్వరగుప్తాతో కలిసి ప్రారంభించారు.



తాండూరు మున్సిపల్ పరిధిలోని జరిగిన వధశాలల వేలం ప్రక్రియ శనివారం మున్సినల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి సమక్షంలో మేకలు, గొర్రెల వధశాలకు రూ.46వేలు పాడి మాజిద్, బీఫ్ వధశాలకు రూ.50వేలు పాడి ఖయ్యూం ఖురేషీ దక్కించుకున్నారు. - తాండూరు, జూన్ 22

రేషన్ బియ్యం పట్టివేత.. కేసు నమోదు

పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం ఆటో

బొంరాస్‌పేట, జూన్ 22 : మండలంలోని బురాన్‌పూర్ గ్రామం నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు. హుజూరాబాద్‌కు చెందిన సంపత్, సిద్దిపేటకు చెందిన పోశెట్టి 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గ్రామానికి వెళ్లి ఆటోను, బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



కులకచర్ల మత్స్య సహకార సంఘం కార్యవర్గానికి నియామకపత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్ రామకృష్ణ

కులకచర్ల గ్రామ మత్స్య సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

కులకచర్ల, జూన్ 22 : కులకచర్ల గ్రామ మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మత్స్య సహకార సంఘం రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా కులకచర్లకు చెందిన కాటన్‌పల్లి అంజిలయ్య, ఉపాధ్యక్షుడిగా శావుకు చెన్నయ్య, కార్యదర్శిగా బూరకొండ నర్సింహులు, డైరెక్టర్లుగా జెల్ల వెంకటయ్య, చాపల మల్లయ్య, పేర్కంపల్లి మొగులయ్య, గంటి సిద్ధయ్య, పగిడ్యాల లక్ష్మి, కోడిగె రాములమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్య సహకార సంఘం అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని పేర్కొన్నారు. ఎన్నికైన సభ్యులకు నియామకపత్రం అందజేశారు.

ఎంఈ, ఎంటెక్ రీవాల్యుయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

సేవాలాల్ సేన రాష్ట్ర కో-కన్వీనర్‌గా గోవర్ధన్ నాయక్

కందుకూరు, జూన్ 22 : సాయిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ ఇస్లావత్ గోవర్ధన్ నాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర కో-కన్వీనర్‌గా ఎంపిక య్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్, రాష్ట్ర కన్వీనర్ సైదానాయక్, భుక్యా నాయక్ శనివారం నియామకపత్రాన్ని అందజేశారు.

వికారాబాద్ : మోమిన్‌పేట మండలం టేకులపల్లిలో ఎడ్ల బండ్లను ఊరేగిస్తున్న రైతులు

ఏరువాక సాగారో..

- ఘనంగా ఏరువాక పౌర్ణమి
- పశువులకు ప్రత్యేక ముస్తాబు, పూజలు, తీపి వంటకాలు
- వికారాబాద్ జిల్లాలోని గ్రామాల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, జేసీబీలను ఊరేగించిన రైతన్నలు

ధారూరు : తరిగోపుల గ్రామంలో..

వికారాబాద్, జూన్ 22 : ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా జరుపుకొన్నారు. శనివారం వికారాబాద్, మోమిన్‌పేట, మర్పల్లి, ధారూరు, బంట్వారం, కోట్‌పల్లి, నవాబుపేట మండలాల్లోని రైతులు పశువులకు రంగులు అద్ది, అందంగా ముస్తాబు చేశారు. డప్పు చప్పుళ్లతో ఎడ్ల బండ్లను గ్రామాల్లో ఊరేగించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి ఈసారి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తీపి వంటకాలను ముందుగా రైతులు పెంచుకుంటున్న పశువులకు పెట్టి పూజించారు.

ధారూరు మండలంలో..

ధారూరు : ధారూరుతో పాటు మండల పరిధిలోని తరిగోపుల, నాగారం, కుక్కింద, నాగసముందర్, మోమిన్‌కలాన్, మోమిన్ ఖుర్దు, దోర్నాల్, ఎబ్బనూరు, చింతకుంట, గురుదోట్ల, అంపల్లి తదితర గ్రామాల్లో రైతన్నలు ఘనంగా ఏరువాక పౌర్ణమి పండుగను జరుపుకొన్నారు. కాడెద్దులు, ఎడ్ల బండ్లను ప్రధాన కూడళ్లలో ఊరేగించారు. కాడెద్దులు, ఎడ్ల బండ్లను చూడడానికి ప్రజలు ఆసక్తి చూపారు.

బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో..

బొంరాస్‌పేట : బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఉదయమే రైతులు పశువులు, ట్రాక్టర్లు, జేసీబీలను శుభ్రంగా కడిగి రంగులతో అందంగా అలంకరించారు. పశువులకు భక్ష్యాలు తినిపించి పూజలు చేశారు.

సాయంత్రం రైతులు గ్రామాల్లోని వీధుల గుండా పశువులు, ట్రాక్టర్లు, జేసీబీలను ఊరేగించారు. ప్రజలు ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయం సాఫీగా కొనసాగాలని ప్రార్థించారు.



బొంరాస్‌పేట : డప్పుచప్పుళ్ల మధ్య కొత్తూరులో ట్రాక్టర్లను ఊరేగిస్తున్న రైతులు

కులకచర్ల మత్స్య సహకార సంఘం కార్యవర్గానికి నియామకపత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్ రామకృష్ణ

బ్యాక్‌లాగ్స్ రాసేందుకు వన్‌టైమ్ ఛాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులకు వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లే పేర్కొన్నారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10లోగా , రూ. 300 అపరాధ రుసుముతో 12 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజు తోపాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ : వివిధ కోర్సుల పరీక్షల ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్, బీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవచ్చని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 29 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బాలికలకు భరోసా.. సుకన్య సమృద్ధి యోజన

వందమంది బాలికలకు ఖాతాలను తెరిచిన యూపీఎస్సీ ర్యాంకర్లు

జామై ఉస్మానియా పోస్టాఫీసు వద్ద సుకన్య సమృద్ధి ఖాతా పుస్తకాలతో బాలికలు, వారి తల్లిదండ్రులు, యూపీఎస్సీ ర్యాంకర్లు, భారతీయ తపాలాశాఖ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: బాలికల భవిష్యత్‌కు సుకన్య సమృద్ధి యోజన పథకం భరోసా ఇస్తున్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పేద బాలికలకు చేయూతనం దించేందుకు భారత తపాలాశాఖ 'స్మార్ట్' కార్యక్రమాన్ని చేపట్టింది. శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని జామై ఉస్మానియా పోస్టాఫీస్‌లో పోస్ట్ మాస్టర్ జనరల్ టీఎం శ్రీలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 64 మంది యూపీఎస్సీ-24 మంది ర్యాంకర్లు పాల్గొని వంద మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిచి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేశారు.

ఐఆర్ఎస్ అధికారులు నరసింహారెడ్డి, అనురాగ్‌సింగ్, ఐఆర్ఏఎస్ అధికారి రాంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై సుకన్య ఖాతాలతోపాటు బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులకు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ డిజిటల్ అకౌంట్లనూ తెరిచారు. ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ.. సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను కేంద్రప్రభుత్వం 2015లో బేటీ బచావో, బేటీ పడావో నినాదంలో భాగంగా బాలికల భవిష్యత్ కోసం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 3,89, 24,105 ఖాతాలను తెరిచారని వివరించారు. అందులో కేవలం పోస్టాఫీస్‌ల ద్వారానే 3,24,66,947 ఖాతాలు తెరిచారని, రాష్ట్రంలో 10,54,062 ఖాతాలు తెరిచారని చెప్పారు. ఈ పథకంతో దేశంలో చాలా వరకు భ్రూణ హత్యలు తగ్గాయని పేర్కొన్నారు. ఎంతోమంది యువతులు వారి పెళ్లిళ్లు, చదువులకు సకాలంలో డబ్బును ఉపయోగించుకున్నారని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి, జూన్ 22 : పరిగి మండలంలోని రాపోల్ ఫీడర్‌లో ఆదివారం మరమ్మతుల వల్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్ పరిధిలోని రాపోల్, పోల్కంపల్లి గ్రామాలకు వ్యవసాయ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఖాజా తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదాతు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962